కొల్చారం: కొంగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం!

- జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 5.70 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- క్వింటా ఏ గ్రేడ్‌కు రూ.2203, సాధారణం రూ.2183
- అందుబాటులో 40 లక్షల గన్నీ బస్తాలు
- ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు

మెదక్ జిల్లాలో 392 కొనుగోలు కేంద్రాలు

మెదక్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మెదక్ జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో 392 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఈ సీజన్‌లో మొత్తం 5.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించే లక్ష్యానికి ప్రణాళికలు రూపొందించారు. మెదక్ జిల్లాలో వానకాలంలో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారుగా 5 లక్షల 70 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.

392 కొనుగోలు కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా 392 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 103, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 272, డీసీఎంఎస్ 10, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు టార్పాలిన్లు సరఫరా చేస్తున్నారు. కేంద్రాల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేస్తారు. దీంతో రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అవుతుంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి లారీలు ఏర్పాటు చేస్తున్నారు. లారీల్లోని ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లుల్లో అన్ లోడింగ్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

అందుబాటులో 40 లక్షల గన్నీ బస్తాలు

జిల్లాలో 392 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా 142 లక్షల గన్నీ బస్తాలు అవసరం ఉన్నాయి. ఇప్పటికే 40 లక్షల గన్నీ బస్తాలను అందుబాటులో ఉంచారు. రెండు మూడు రోజుల్లో మరో 20 లక్షల గన్నీ బస్తాలు రానున్నాయి. 50 లక్షల బస్తాలకు ఆర్డర్ ఇచ్చారు. మరో 20 లక్షల గన్నీ బస్తాలు రైస్ మిల్లుల వద్ద ఉన్నాయి. జిల్లాలో 156 రైస్ మిల్లులు ఉండగా, అందులో నాలుగు రైస్‌మిల్లులపై కేసులు నమోదయ్యాయి. 7 కోట్ల ధాన్యం కమీషన్ విడుదలయ్యింది. ఇందులో పీఏసీఎస్‌కు రూ.5 కోట్ల 18 లక్షలు, డీసీఎంఎస్‌కు రూ.24 లక్షలు, ఐకేపీకి కోటి 43 లక్షలు, ఎఫ్‌పీవోకు రూ.10 లక్షలు విడుదలయ్యాయి. ఇంకా రూ.3 కోట్లు రావాల్సి ఉంది.

క్వింటా ఏ గ్రేడ్‌కు రూ.2203, సాధారణం రూ.2183

ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేసిన ప్రభుత్వ యంత్రాంగం రైతుల వద్ద నుంచి ఏ గ్రేడ్ ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.2203గా, సాధారణ రకానికి రూ.2183 ధరగా నిర్ణయించారు. దీంతో రైతులు గ్రామాల్లో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తరలించనున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత తొందరగా రైతుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

మెదక్ జిల్లావ్యాప్తంగా 392 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 5.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. బుధవారం జిల్లాలో 10కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మండల స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు పరిశీలించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టి ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుడుతాం. – హరికృష్ణ, పౌర సరఫరాల సంస్థ, జిల్లా మేనేజర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొల్చారం, అక్టోబర్ 25: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కౌడిపల్లి ఏడీఏ సత్యవతి అన్నారు. కొల్చారం మండలంలోని కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్, సంగాయిపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, ఎంపీడీవో గణేశ్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సౌలభ్యం కోసమే ప్రభుత్వం గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణాకర్‌రెడ్డి, మంజీరా రైతు సంఘం చైర్మన్ జితేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, ఏఈవోలు వినీ తాభవానీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్ అర్బన్, అక్టోబర్ 25: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే రైతులు నిబంధన ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం హవేళీఘనపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వానకాలం సీజన్లో ధాన్యం కొనుగోలుకు అన్ని సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి సెంటర్లో ప్యాడి క్లీనర్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా కొనుగోళ్లు జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ట్రాన్స్‌పోర్టు లారీల ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సెంటర్లో 22 వేల కింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రానికి వస్తున్నందున రైతులు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల సమస్య తీర్చడానికి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 24 గంటలు అందుబాటులో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. రైతులు కేవలం లారీల కోసం కంట్రోల్ రూం నెం 9281103684 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ఎంఏ ముఖీమ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన చింతా ప్రభాకర్

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

కచ్చితంగా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే... సంగారెడ్డికి మంచిరోజులు వచ్చాయ్...

- సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- సదాశివపేటకు జగ్గారెడ్డి ఒక్కసారి కూడా రాలేదు
- నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి చింతా ప్రభాకర్
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- మంత్రి సమక్షంలో మనబన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఏ ముఖీమ్ చేరిక
- సదాశివపేటలోని ముర్షద్ దర్గా మైదానంలో 10వేల మందితో ఆత్మీయ సమ్మేళనం

సదాశివపేట, అక్టోబర్ 25: వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. బుధవారం మనబన్ ఫౌండేషన్ చైర్మన్, సుప్రీం కోర్టు న్యాయవాది ఎంఏ ముఖీమ్, ఫౌండేషన్ సభ్యులు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఇలియాజ్ షరీఫ్, జేఏసీ జిల్లా చైర్మన్ సత్తయ్య యాదవ్, మునిపల్లి రమేశ్, ఉన్నాల్ బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి హరీశ్‌రావు, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పట్టణంలోని ముర్షద్ దర్గా మైదానంలో 10వేల మందితో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు మద్దతుగా మనబన్ ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు బీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉన్నదన్నారు. ఐదేండ్లలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి సదాశివపేటకు ఒక్కసారి కూడా రాలేదన్న విమర్శించారు. గత ఎన్నికల్లో పేదలకు ఇండ్ల స్థలాలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగ్గారెడ్డి సంగారెడ్డికి రాలేదన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి చింతా ప్రభాకర్ అని గుర్తు చేశారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమని, పేదలకు ఇండ్ల స్థలాలు, పట్టాలు అందజేసే బాధ్యత తనదేనన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై...

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితుడినై బీఆర్ఎస్‌లో చేరానని మనబిన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఏ ముఖీమ్ తెలిపారు. మూడేండ్లలో ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, క్రీడలకు ఎన్నో కార్యక్రమాలు చేశానన్నారు. దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉన్నదన్నారు. ఉపిరున్నంత వరకు బీఆర్ఎస్‌తోనే ఉంటానన్నారు. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని, బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు.

మద్దతు తెలపడం సంతోషకరం..

మనబిన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఏ ముఖీమ్, ఫౌండేషన్ సభ్యులు మద్దతు ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ముఖీమ్ సాబ్ వేరే పార్టీ నుంచి పోటీలో ఉన్నా మంత్రి హరీశ్‌రావు సూచన మేరకు 10వేల మందితో బీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉన్నదన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రచార ఇన్‌చార్జులు ఎర్రోళ్ల శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేందర్, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, (గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్

ఎర్రోళ్ల శ్రీనివాస్

ఎంఏ ముఖీమ్

కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలి

- సంగారెడ్డిలో చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- జగ్గారెడ్డి ఎన్నడూ జనంలో లేడు... చింతా ఎప్పుడూ జనం వెన్నంటే..
- నాలుగేండ్లలో సంగారెడ్డి అభివృద్ధికి చింతా ప్రభాకర్ ఎనలేని కృషి
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- మంత్రి సమక్షంలో కాంగ్రెస్ నుంచి పెద్దఎత్తున చేరికలు

కంది మండలం ఎద్దుమైలారంలో మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

సంగారెడ్డి అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపు ఖాయమైందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ముఖ్యనేతలు, నాయకులు వందల సంఖ్యలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతుండడం బీఆర్ఎస్ గెలుపునకు నిదర్శనమన్నారు.

బుధవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నేతలు పెద్దసంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. సదాశివపేటలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ నేత, మనబిన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముఖీమ్ వందలమంది మద్దతుదారులతో బీఆర్ఎస్‌లో చేరారు. సంగారెడ్డిలోని నాల్సా బ్‌గడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ మైనార్టీ నేతలు జమాల్, మసూద్, జహంగీర్ బేగ్, ఇంతియాజ్, అజార్ బేగ్, ఇఖ్రహంలతోపాటు వందమంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. లారీ అసోసియేషన్ నాయకుడు అబూబాకర్ తన మద్దతుదారులతో బీఆర్ఎస్‌లో చేరారు. ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ అధ్యక్షుడు సరబ్‌జిత్ సింగ్, కార్యకర్తలు దేవేందర్ సింగ్, రతన్ సింగ్, మంజిత్ సింగ్, విక్కీసింగ్‌తో పాటు 50మంది బీఆర్ఎస్‌లో చేరారు. కంది మండలం ఎద్దుమైలారంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి బీర్ల శివకుమార్ మూడు వందల మంది మద్దతుదారులతో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. సంగారెడ్డి ప్రజలు, పార్టీ నేతల ఉత్సాహం చూస్తుంటే చింతా ప్రభాకర్ బ్రహ్మాండమైన మెజార్టీతో గెలుపొందటం ఖాయమన్నారు. సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన జగ్గారెడ్డి నియోజకవర్గంలో ఉండకుండా హైదరాబాద్‌కు పరిమితమయ్యారన్నారు. స్వల్ప ఓట్లతో ఓడిపోయిన చింతా ప్రభాకర్ మాత్రం జనం మధ్య ఉన్నట్లు చెప్పారు.నాలుగేండ్లలో చింతా ప్రభాకర్ ప్రజల కోసం పనిచేశారని చెప్పారు. కరోనా వస్తే జగ్గారెడ్డి జాడలేకుండా పోయారన్నారు. చింతా ప్రభాకర్ మాత్రం కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం పట్టుబట్టి నిధులు సాధించుకు వచ్చినట్లు తెలిపారు. ప్రజల వెన్నంటి ఉన్న చింతా ప్రభాకర్‌ను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ వల్లే సంగారెడ్డికి మెడికల్ కాలేజీ, నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు వల్లే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రజలకు మరింత అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ చింతా ప్రభాకర్ తనకు మంచి మిత్రుడని, ప్రజల కోసం పనిచేసే చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నేత మామిళ్ల రాజేందర్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్లం మాణిక్యం మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకర్గ ప్రజల కోసం నిరంతరం పనిచేసే చింతా ప్రభాకర్‌ను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, బీజేపీ నేతలు మామిళ్ల రాజేందర్, జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంఏ హకీం, మామిళ్ల రాజేందర్, వెంకటేశ్వర్లు, నర్సింహులు, విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

- మన ప్రభుత్వం వస్తే రూ.400లకే గ్యాస్ సిలిండర్
- పట్టణాభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు
- మైనార్టీ విద్యార్థులకు డిగ్రీ కళాశాల
- గెలిచిన ఎమ్మెల్యే హైదరాబాద్‌కు పరిమితం
- పదేండ్లలో చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నది
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు

ప్రజల మనిషి ప్రభాకర్‌ను గెలిపించాలి

గ్యాస్ రూ.300ల నుంచి రూ.వెయ్యికి పెంచిన బీజేపీ

సంగారెడ్డి, అక్టోబరు 25: శాసనసభ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే గ్యాస్ రూ.400లకే పంపిణీ చేస్తామని, ప్రజల మనిషి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డులో ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మైనార్టీలు చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. అంతకుముందు మదీనా చౌరస్తాలో 4 వార్డులకు సంబంధించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడు ప్రభాకర్‌ను గెలిపించుకోవాలని, కరోనా కష్టకాలంలో బాధితులకు అండగా నిలిచిన నాయకుడు ప్రభాకర్ అని గుర్తు చేశారు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తూ నారాయణఖేడ్ బహిరంగసభలో సీఎం కేసీఆర్ రూ.50కోట్ల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ నిధులో రూ.17కోట్ల పనులు పూర్తికాగా మిగతా నిధులను ఎన్నికల అనంతరం ఖర్చు చేసి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పదేండ్లలో అన్నిరంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్నామని, ముఖ్యంగా మైనార్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసి మెరుగైన విద్యను అందించామన్నారు. ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి మైనార్టీ విద్యార్థులకు డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రూ.300 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరలను ఏకంగా రూ.వెయ్యికి పెంచి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలపై భారంమోపిందన్నారు. రైతుబీమాతో రాష్ట్రంలో 1.17లక్షల మందికి రూ.5లక్షల పరిహారాన్ని ప్రభుత్వం అందజేసిందన్నారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ' ధీమా అనే పథకాన్ని అందించేందుకు సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. పదేండ్లలో చేసిన అభివృద్ధి ప్రజల కండ్ల ముందు కనిపిస్తున్నదని, మరోసారి అవకాశమిస్తే దేశంలోనే అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిని ఆహ్వానిస్తున్న మంత్రి

హైదరాబాద్‌కే పరిమితమైన ఎమ్మెల్యే

ప్రజల ఓట్లతో గెలిచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా ఎమ్మెల్యే హైదరాబాద్‌కే పరిమితమయ్యారని మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. ప్రజల ఓట్లతో గెలిచి అపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సిన ఎమ్మెల్యే కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులో ఉండకపోవడం నియోజకవర్గ ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. ఈసారి ఎన్నికల రావడంతో మరోసారి ప్రజలను మాయమాటలు చెప్పి మోసంచేసేందుకు వస్తున్నారని, ఎమ్మెల్యే మాటలకు మోసపోకుండా నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి చింతా ప్రభాకర్ భారీ మెజార్టీతో గెలిపించి ఆసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజలు తీసుకునే నిర్ణయంతో అభివృద్ధి, సంక్షేమం పథకాలు ప్రజలకు అందించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.

తల్లి, కూతుళ్ల కన్నీళ్లతో ఎమ్మెల్యేగా గెలుపు

గత ఎన్నికల్లో ఎమ్మెల్యే భార్య, కూతుళ్లు ప్రజల ముందుకొచ్చి కన్నీళ్లు పెట్టుకోవడంతో ఎమ్మెల్యేగా గెలిచిన జగ్గారెడ్డి ఐదేండ్లపాటు ప్రజలను పట్టించుకోలేదని బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ విమర్శించారు. ఎన్నికలు రాగానే ప్రజల ముందుకొచ్చి మోసలి కన్నీళ్లతో మోసం చేసి గెలవాలని కుట్రలు చేసే ఎమ్మెల్యేకు తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో అమలుకు సాధ్యంకాని హామీలతో గెలవాలని తాపత్రయ పడుతున్నదన్నారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, అక్కడి ప్రజలు వాట్సాప్‌లో పోస్టులు పెట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నిస్తున్నారన్నారు. సంగారెడ్డిలో తనను గెలిపించాలని ప్రజలకు ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్లం మాణిక్యమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు, మామిళ్ల రాజేందర్, వెంకటేశ్వర్లు, నర్సింహులు, షేక్ సాబేర్, పార్టీలో చేరిన కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.